క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

ధన్వాడ: మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 11న జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని డాక్టర్ మునిర్ హమ్మద్ తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు జాగ్రతగా ఉండాలని తమ చుట్టు ఉండే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కథలప్ప, ఎస్‌ఓ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలువకుండా మరమ్మతు చేయాలి



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటకు వెళ్లే రోడ్డు మరమ్మతుకు నోచుకోవడం లేదు. గ్రామంలోని ప్రధాన రహదారి రైల్వే యూటీ వంతెన దగ్గర వర్షపు నీరు నిలిచి రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో బైక్‌లు అదుపుతప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ అధికారులు స్పందించి వెంటనే యూటీ వంతెన కింద నీరు నిల్వకుండా మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హైమాస్ట్ లైట్ ఏర్పాటు



మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీలోని చౌడేశ్వరీ దేవాలయం ఆవరణలో హైమాస్ట్ లైట్‌ను శుక్రవారం పుర కమిషనర్ శ్రీకాంత్ ప్రారంభించారు. మున్సిపల్ నిధులు రూ. 2.50 లక్షలతో దీనిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తొగుట వీర క్షత్రియులు పాల్గొన్నారు.

ఊట్కూరులో సీసీ కెమెరాల ఏర్పాటు



ఊట్కూరు: ఊట్కూరులోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో 13 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలతో దొంగతనాలకు చెక్ పెట్టడంతో పాటు కేసులను సులువుగా ఛేదించవచ్చన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: పట్టణ నూతన గణేష్ ఉత్సవ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీంచందర్, ఉపాధ్యక్షుడిగా ఆశప్ప, ఉషనప్ప, చెన్నారెడ్డి, సైదప్ప, విద్యాధర్ దీక్షిత్ , ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, సహ కార్యదర్శులుగా చందు, రాఘవేంద్ర, రాజేష్, విజయ్, కిరణ్, కోశాధికారి రఘుతో పాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు సురేఖ, కార్యదర్శి కన్న శివకుమార్, బజరంగ్దళ్ జిల్లా సంయోజక్ శ్రావణ్ కుమార్, నగర అధ్యక్షులు మురళీ భట్టడ్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి



సాక్షి నెట్‌వర్క్: నిజాం పాలనలో జరిగిన అన్యాయాలను ఎదురించిన తొలితరం యోధుడు పండుగ సాయన్న అని నాయకులు అన్నారు. శుక్రవారం పండుగ సాయన్న 165వ జయంతి సందర్భంగా కోస్గి, మక్తల్, కృష్ణా, ధన్వాడ, ఊట్కూరు, కొత్తపల్లి, మద్దూరులో సాయన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.

‘ఇందిరమ్మ’ పేరిట ఇసుక దందా

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- లబ్ధిదారుల పేర్లపై అనుమతి
- పట్టించుకోని అధికారులు



దాసర్‌పల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు (ఫైల్)

మక్తల్: ప్రతి పేదవాడు సొంతింట్లో ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో ఇళ్లను మంజూరు చేసింది. ఈ మేరకు ఇళ్లకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని నిర్ణయించింది. అయితే కొందరు నాయకులు ఇదే అదనుగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరుతో ఇసుకను అక్రమంగా తరలించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. లబ్ధిదారుడి ప్రొసిడింగ్, ట్రాక్టర్ అనుమతి కాగితాలను తీసుకెళ్లి తహసీల్దార్‌కు దరఖాస్తు చేస్తుండడంతో పలు నిబంధనలతో అనుమతులు ఇచ్చారు. అయితే దళారులు లబ్ధిదారుల ఇళ్లను కాదని మరొకరి ఇళ్లకు ఇసుకను తరలిస్తున్నారు. వాగుల్లో జేసీబీ సాయంతో ఇష్టమొచ్చినట్లు తవ్వుకుంటూ ఇసుకను తోడేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అమ్ముకుంటున్నారు. మొదటిగా ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకొని సాయంత్రం సమయంలో మాత్రం ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఎవరైనా వచ్చి ప్రశ్నిస్తే అనుమతి పత్రం చూపించి ఏవేవో సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

మండలంలో ముఖ్యంగా దాసర్‌దొడ్డి, వర్కూర్, చిట్యాల వాగుల నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రతి ఇంటికి 8 ఇసుక ట్రిప్పులను తరలించుకునేందుకు అది ఉదయం నుంచి సాయంత్రంలోపు తీసుకెళ్లేలా అనుమతి ఇచ్చారు. కానీ నిబంధనలను పట్టించుకోకుండా దళారులు వాగులో నుంచి ట్రాక్టర్ బయటకు వెళ్లిందంటే చాటు ఎక్కడ వెళ్లాలో డ్రైవర్లకు లోకేషన్ పంపిస్తారు. రాత్రి, పగలు తేడా లేకుండా అందిన కాడికి ఇష్టానుసారంగా ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. అధికారులకు ఫోన్లు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక నాయకుల అండతోనే ఇదంతా జరుగుతుందని అధికారులు అడకత్తెరలో పోకలాగా అయ్యారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిఘా ఏర్పాటు చేస్తాం



ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దందా సాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇకపై ఇసుక బయటకు పోకుండా నేరుగా లబ్ధిదారులకు ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. కమిషనర్, ఎంపీడీఓ లెటర్లపై రాసి ఇచ్చిన ప్రకారం అనుమతులు ఇస్తున్నాం. ఇసుక ట్రాక్టర్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని ఎస్ఐకి కూడా సూచించాం. లబ్ధిదారుడి ఇంటికి కాకుండా వేరే చోటికి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– సతీశ్‌కుమార్, తహసీల్దార్, మక్తల్

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య

మక్తల్: ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య విమర్శించారు. శుక్రవారం మక్తల్‌లో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను ఏమాత్రం అమలు చేయడంలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన చేతిలో లేని హామీలను ఇచ్చి వంగి వంకాయలు ఎరమంటే ఎగిరి తాటికాయలు తెంచుతా అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేసిన ధర్నా డ్రామాను తలపించిందన్నారు. క్యాబినెట్‌లో ఎంత మంది బీసీలకు న్యాయం చేశారో స్పష్టంగా కన్పిస్తుందన్నారు. దమ్ము ఉంటె స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో మక్తల్ జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. మక్తల్‌లో గురుకుల భవనాలు, ప్రభుత్వ భవనాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కల్లూరి నాగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అనంపల్లి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.35లక్షల పరిహారం చెల్లించాలి



దీక్షలో పాల్గొన్న రైతులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో భూ నిర్వాసిత రైతులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, బసిరెడ్డిలు దీక్షలో పాల్గొని రైతులకు మద్దతు తెలియజేశారు. పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాన్‌కుర్తిలో చేపట్టనున్న రిజర్వాయర్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.35 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు వెన్నంటి ఉంటామన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, సాబప్ప, రైతులు పాల్గొన్నారు.

బాధితుడికి మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శ



స్వామినాథ్‌గౌడ్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

నర్వ: ఉమ్మడి మండలం కన్మనూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు స్వామినాథ్‌గౌడ్ న్యూరో సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక, మత్స్య, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మంత్రి వెంట నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలు



కోస్గిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి రూరల్: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు, నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలను గుండుమాల్ మండలం, కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు భీంరెడ్డి , కోడిటగంటిహరి, అన్నకిష్టప్ప, బాలేష్ , మాస్టర్ శ్రీనివాస్, ఇద్రుస్, బాల్‌రాజ్, భానునాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి, మద్దూరు: కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో నాయకులు ఘనంగా జరుపుకొన్నారు.అంతకు ముందు మండల సామాజిక కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

జ్ఞాన సమాజ నిర్మాణమే అంతిమ లక్ష్యం

మద్దూరు: రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి వారియర్స్ స్వేరో కోర్ సైనికులను ఎంపిక చేయనున్నట్లు రాష్ట్ర స్వేరో బాబు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దూరులో జిల్లా స్వేరోస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర చీఫ్ బాబునాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్వేరో సైన్యాన్ని తయారు చేసే భాగంలో జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేష్, గౌరవ అధ్యక్షుడు నరసింహాస్, జిల్లా అధ్యక్షుడు నడ్డి రాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, పొన్నయ్య, రాజు, మణికంఠ, దుబాయ్ కృష్ణ, వెంకటయ్య,అంజప్ప ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి



మాగనూర్: మండల పరిధిలో గురువారం ఉరుములు, పిడుగులతో కురిసిన భారీ వర్షానికి పిడుగు పాటుకు గురై ఓ ఎద్దు మరణించింది. కుర్వ పెద్ద వెంకటప్ప ఎద్దును తన వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి వెళ్లాడు. రాత్రి పిడుగు పడటంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. శుక్రవారం పొలం దగ్గర వచ్చి చూసేసరికే మృతి చెంది ఉండడంతో కన్నీటిపర్యంతమయ్యాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

షీటీం సేవలపై అవగాహన

నర్వ: వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు గురైన బాలికలు, మహిళలకు షీటీం అండగా ఉంటుందని జిల్లా షీటీం పోలీస్ బాల్‌రాజు అన్నారు. శుక్రవారం నర్వ కేజీబీవీలో విద్యార్థినులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే 87126 70398కి కాల్ చేసి సమస్యను చెప్పవచ్చన్నారు. కంప్లెయింట్ ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే భరోసా సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు, యువతులకు ఏ ఇబ్బందులు ఎదురైనా షీటీంను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చెన్నప్ప, జ్యోతి, కవిత, ఎస్‌ఓ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ మంజూరు హమ్మద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి తెలిపారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కోటకొండలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు. వర్షాకాలంలో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సరస్వతి, ఆశ వర్కర్ కల్పన, అంజమ్మ, బిల్ కలెక్టర్ నరసింహ, పంచాయతీ కార్మికులు కిష్టప్ప, సాయిలు పాల్గొన్నారు.

దుస్తులు, ఐడీ కార్డుల పంపిణీ

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటైజేషన్, వాటర్‌మెన్, ఇతర సిబ్బందికి పంద్రాగస్టును పురస్కరించుకొని దుస్తులు, ఐడీ కార్డులు, అప్రాన్లను శుక్రవారం పుర కార్యాలయంలో పుర కమిషనర్ శ్రీకాంత్ పంపిణీ చేశారు. శనివారం నుంచి మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ నీటి కనెక్షన్ లెక్కింపు సర్వేను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సర్వే కోసం వచ్చే పుర సిబ్బందికి మున్సిపాలిటీ ప్రజలు సహకరించాలని కోరారు.

తల్లిపాలు అమృతంతో సమానం



మద్దూరులో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మద్దూరు: పుట్టిన శిశువుకు తల్లి పాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం మద్దూరులోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. శిశువు పుట్టిన అరగంటలో ముర్రుపాలను తప్పనిసరిగా తాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరోజ, రాధిక, రూప, మండల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

మక్తల్: మండలంలోని కాచ్‌వార్ అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వం అందజేసే గుడ్లు, పాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన, ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడి టీచర్ నవీన, లక్ష్మి, ఆశావర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్/ఊట్కూరు: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం, మక్తల్ ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, బీఎస్పీ సంఘాల నాయకుల డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సతీశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బస్‌స్టాప్ దగ్గర గత అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహం చూపుడు వేలు, కళ్లద్దాలు, ముఖం, తల బాగాలు విరగొట్టి ధ్వంసం చేశారన్నారు. ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్, చంద్రశేకర్, విజయ్‌కుమార్, పోలప్ప, బాలకృష్ణయ్య, రాములు, మారుతీ, నర్సిములు, రామలింగం, శివకుమార్, విష్ణు, రోహిత్, హరీష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ అభ్యర్థులను గెలిపించండి’



నాగిరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నర్వ: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గడపగడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఉజ్వల సిలిండర్, గరీబ్‌కల్యాణ్ అన్న యోజన కింద ఉచిత బియ్యం, గర్భిణులకు పౌష్టికాహారం, వ్యవసాయానికి సబ్సిడీపై ఎరువులు, కిసాన్ సమ్మాన్ ద్వారా రైతుల ఖాతాలకు డబ్బులు జమచేయడం, ఉపాధి హామీ ద్వారా రోజు కూలీల కల్పించినట్లు తెలిపారు. రైతు వేదికలు, శ్మశానవాటికలు, సీసీ రహదారులు కేంద్రం చేపడుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలిచి అభివృద్ధికి పాడుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, లలితమ్మ, అంజి, కుర్వసత్యం, వెంకటేశ్వర్‌రావు, విజయ్‌రామ్, కట్ట నర్సిములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పేట’ను అభివృద్ధి చేసింది ‘ఎస్ఆర్‌రెడ్డే’

నారాయణపేట: పేట ప్రజల కలలను సాకారం చేసింది నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డే అని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం పబ్బం గడుపుతూ వచ్చిందని విమర్శించారు. రాజేందర్ రెడ్డి హయాంలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేయించారన్నారు. మరో పది శాతం పనులు పూర్తయి ఉంటే ఈపాటికె నారాయణపేటకు సాగునీరు అంది ఉండేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మిగిలిన పనులు పూర్తి చేస్తే బీఆర్‌ఎస్ పార్టీకి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కావాలనే అన్ని అనుమతులు ఉన్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను చేపట్టడం లేదన్నారు. నిజంగా నారాయణపేట, మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు ఈ ప్రాంత రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్న మిగిలిన పనులను పూర్తి చేసేందుకు సీఎంపై ఒత్తిడి తెచ్చేవారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎస్.రాజేందర్ రెడ్డి సాగునీళ్లు తీసుకొస్తానని సవాల్ చేస్తే, ఆడపిల్ల మీద తొడగొట్టాడని అసత్య ప్రచారాలు చేసుకుని గెలిచిన కాంగ్రెస్ నాయకుల మాటలను మరో మారు నమ్మవద్దన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో నష్టపోతున్న రైతులకు ఎకరానికి 30 లక్షలు, ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు



నారాయణపేటలో లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో..



మద్దూరులో కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. వరలక్ష్మీదేవిని పూలతో అలంకరించి గణపతిపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి పూజలు జరిపించారు.

- నారాయణపేటలోని లోకాయిపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, అలంకరణ, మంగళారతి, మహానైవేద్యాన్ని సర్పించారు.
- మద్దూరులోని వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు శోభారాణి, మీనా, గాయిత్రి, శైలజ, నర్మదా తదితరులు పాల్గొన్నారు.
- దామరగిద్దలోని వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించి, వివిధ రకాల వంటకాలతో చేసిన నైవేద్యాలను సమర్పించారు.
- ధన్వాడలోని ప్రైవేట్ పాఠశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ఏర్పాటు చేసి వాయనలు అందజేశారు. ధన్వాడలోని శ్రీసాయి సరస్వతి విద్యామందిర్, చైతన్యవిద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులు వ్రతాలు చేసి మొక్కలు నాటారు.
- మరికల్‌లోని సరస్వతీ దేవి ఆలయంలో ఆలయ పూజారులు వెంకటేశ్వర్లు శర్మ, శివప్రసాద్ మహిళలతో వరలక్ష్మి వ్రతాలను చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు